(ఆంధ్రజ్యోతి వీక్లీ 5-8-1975)

హ్యాయ్యస్టు టెండరు

"ఎందాకండీ" అనే పులకరింపు విని పక్కకి తిరిగి చూసేను.

ఇరవై నిమిషానించి సిటీ బస్సుకోసం చూస్తూ నిలబడ్డానక్కడ. నేనెళ్ళబోయే వైపుగా కార్లో వెడుతూ, కారాపి అడిగాడు.

నన్నే అడుగుతున్నాడని తెలియనట్టు అటూ ఇటూ చూశాను.

"మిమ్మల్నే" అన్నాడు కార్లో ఆయన.

వెర్రినవ్వు నవ్వి వూరుకున్నాను.

"ఇంటికేనా? నేను కార్లో దిగబెడతాను రండి" అన్నాడు. నావైపు చూస్తూ, చూపిస్తూ.

"సారీ- మీకు శ్రమ యిస్తున్నాను" అంటూ కారు దగ్గరకి చేరాను.

"శ్రమేం లేదు. నేనూ అటే వెడుతున్నాను" అని, కారు తలుపు తెరిచి, రండి! అన్నాడాయన.

నేను లోపల కూర్చోగానే కారు స్టార్ట్ చేశాడు. "మీ ఇంటికి వద్దామనుకుంటున్నాను. రెండు రోజులై!"

"మా యిల్లు కూడా తెలుసన్నమాట" అనుకొని వూరుకొన్నాను.

"మిమ్మల్ని అక్కడక్కడ చూస్తూనే వుంటాను. నేను లాయర్ని. నా పేరు బాలకృష్ణమూర్తి. మీరుంటున్న వీధికి అవతల వీధిలో వుంటాం మేం."

"అలాగా? చాలా సంతోషం. మిమ్మల్ని తెలుసుకున్నందుకు" అంటూ చేయి కలిపాను. ఆయన కారు నడుపుతూనే నా చేతిని అందుకొని, క్షణంపాటు నొక్కి వదిలాడు.

నేను ఫలానా అని పరిచయం చేసుకున్నాను.

"అవును! తెలుసు. మీ ఇంటిముందు బోర్డుంటుందిగా, అక్కడ మిమ్మల్ని చాలాసార్లు చూశాను."

"అయ్యో!"

రెండు రిక్షాలని తప్పుకోడం, ఓ సిటీబస్సుని ఓవర్ టేక్ చెయ్యడం

నెత్తిమీద కేరేజీల తట్టతో ఉన్నవో ఆడమనిషి కారుకింద పడకుండా చూసుకోడం ఇలాంటివేవో తగిల్తే ఆయన ఓ అర నిమిషంపాటు చక్రంమీద ఏకాగ్ర దృష్టి పెట్టుకుని వూరుకున్నాడు.

"మాకో చిన్న సమస్య వొచ్చి పడ్డాదండీ" అన్నాడు బాలకృష్ణమూర్తి గారు. ఖాళీకాగానే.

"చెప్పండి!"

"లాయర్స్ మేం యాభైమందిమి కలిసి మద్దెలపాలెంలో పదెకరాల భూమి కొన్నామండి. దాన్ని మా యాభైమందికీ అయిదేసి వందల గజాల చొప్పున పంపకాలు వెయ్యాలి."

"వెయ్యొచ్చు" అన్నాను మనసులోనే గుణకారం చేసుకుని.

"ప్రతి జాగా చుట్టూ భూమ్మీద రాళ్ళు పాతించాలండి"

"అదీ చెయ్యొచ్చు"

"రోడ్లకి, పార్కులకి జాగాలు వొదిలిపెట్టి ఇళ్ళస్థలాలు వేర్వేరుగా చూపిస్తూ లేఔట్ ప్లాన్ తయారు చెయ్యాలి."

"అయ—"

"ఆ ప్లాన్ని మునిసిపాలిటీ ఆఫీసులోను, అవసరమైతే టవున్ ప్లానింగ్ ఆఫీసులోను అప్రూవ్ చేయించాలి."

"అయ"

ఆ తర్వాత భూమ్మీద రోడ్లు, సైడు కాలువలు ఏర్పాటుచేసి, రోడ్లమీద సహం మేర కంకరా. కాలవలకి కానాలు వెయ్యాలి.

"అయ—"

"అంటే. మేంమీకు, క్రయ చీటీదాఖలా భూమి. మొక్కా-మోడీ మిట్టా పల్లం చూపిస్తాం. అంతే కాలవలు తవ్వించడం, కానాలు కట్టించడం రోడ్లు వేయించి కంకరపోయించి సాపు చేయించడం అన్నీ చేసి. ఎవరి ప్లాను ప్రకారం వారు ఇళ్ళు కట్టుకుందికి వీలుగా జాగాలు చూపించాలి. ఏజాగాలో ఎవరు ఇల్లు కట్టాలనేది మేం లాటరీవేసి నిర్ణయించుకుంటామనుకోండి— అది మీకు సమ్మంధం లేదు."

"అద్సరే అనుకోండి.... ఎన్నాళ్ళలో కావాలండి!" అన్నాను.

"ఎన్నాళ్ళేముంది? ఇందులో కొన్ని అర్జంటుగా చెయ్యగలిగినవి

వున్నాయి. కొన్ని తీరుబాటుగా చెయ్యవలసినవివున్నాయి. కొన్ని" అని నా వేపు భావగర్భితంగా చూసి, చిన్న వెటకారపు నవ్వుకూడా నవ్వి. "కొన్ని అసలు అవుతాయో అవవో తెలీనివి వున్నాయి కదా మరి" అన్నాడు.

"అవునవును. కాని తీరా మోసి స్థలాలు కొన్నారు గనక ఇళ్ళు కట్టుకోవా లని మీలో కొందరికి ఆదుర్దాగా వుంటుందేమో కదా" అన్నాను.

"ఆ మాటా నిజమే. ఈ సొసైటి మెంబర్లు యాభై మందిలో సంగోరు మంది అప్పుడే సిమ్మెంటూ ఇనుమూ సిద్ధంచేసి పెట్టుకున్నారు కూడాను!"

కనకవేదో ఇంత టైం అని అనుకోడం మంచిది కదా!"

"ఓ మూడు నెలల్లో చేయించగలిగితే సంచిపనుకుంటాను" అన్నాడాయన

కారు మా యింటి కెదురుగుండా ఆగింది.

"మీరు ఎస్టిమేటువేసి ఇచ్చేస్తే, అర్జంటుగా సొసైటీ మీటింగుపెట్టి మిగతాపన్లు చేయించేడమే" అని కారులోంచి దిగాడాయన.

నేను నా వేపునించి కారు దిగి క్షణం ఆలోచించేను. "మిట్టాపల్లం చెట్టూ చేమా అంటున్నారు. నేల చూడందే ఎస్టిమేటు వెయ్యడం కష్టమండి" అన్నాను.

"మా ఆలస్యం ఏమీలేదు. మీకిప్పుడు ఖాళీఅయితే ఇలాగే వెళ్ళిచూసేద్దాం రండి" అని కార్లోదూరి, నావేపు మూసిన కారు తలుపు తెరిచాడు బాలకృష్ణ మూర్తిగారు.

* * *

పొంగి బోర్లాపడ్డాను.

యల్. సీ. ఈ. చదువుకొని, ఆర్. ఎండ్. బి. డిపార్టుమెంట్లో ఓవర్ సీరుగా పనిచేసుకుంటున్నాను. పన్నాలుగేళ్ళ సర్వీసులో పట్టుమని పదిరూపా యలు సేవింగ్సు బాంకులో నైనా వేసుకున్న పాపాన్నిపోలేదు. వుచ్చు నాలుగు వందలేభై రూపాయల జీతంతో కిందా మీదాపడి సంసారాన్ని అలా అలా నెట్టు కొస్తున్నాను. అప్పుడో మాటూ అప్పుడో మాటూ ఏ కాంట్రాక్టరు బాబో దయ తలిస్తే పైవాళ్ళు తినగా మిగిలినవి పదో పాతికో నామీద పడుతున్నాయి. పని మనిషికి పండుగ మామూళ్ళొచ్చినట్టు. నేను, నా భార్య ముగ్గురు పిల్లలు. ఎది గొచ్చి ఎల్లెమ్మియీ చేత్తోపుచ్చుకొని ఉద్యోగం దొరక్క బాధపడుతూ బాధ పెడుతున్న మా తమ్ముడు- ఈతకిమించిన లోతైపోయింది, బతుకు.

బాలకృష్ణమూర్తిగారి పుణ్యమా అని కొంచెం బతికి బైటపడే అవకాశం కలిగేటట్టు కనిపిస్తున్నాది.

నిజమే. బాలకృష్ణమూర్తిగారు వొప్ప చెప్తున్నపని నేను ఒక్కణ్ణే చెయ్య లేను. మరొక ఓ వర్కర్ని కలుపుకోవాలి సరే. రామనాథం వున్నాడుగా- కలు స్తాడు, చిన్నవాటా పారెయ్యొచ్చు. ఒకరిద్దరు మేస్త్రీలు కావాలి. డిపార్టుమెంటు చల్లగా వుండాలిగాని మనుషులే దొరక్కపోతారా?

రాత్రంతా కూచుని ఎస్టిమేట్లు వేసేను.

పదెకరాల ప్లాటులో నూట ఇరవై రెండు మామిడి చెట్లు, ఆరు చింతచెట్లు నలభయ్యారు తాటిచెట్లూ వున్నాయి.

అవన్నీ కొట్టించాలి.

చదును చేయించవలసిన భాగం ఎకరంనర దాకా వుంటుంది.

బుల్డోజరుకి వొక్కరోజు పని.

యాభై ప్లాట్లతో లేఔట్ కొల్తకి రెండువందల నలభయ్యయిదు రాళ్లు పడతాయి. రాయి రూపాయన్నర పెట్టి కొనాలి. మరో అర్ధరూపాయి పాతడానికి ఖర్చవుతుంది, ఒక్కొక్క రాయికీను.

ఎనిమిది వందల యాభై అడుగుల పొడుగు, అయిదువందల అడుగుల వెడల్పూ వుంది జాగా. మూడువేల అయిదువందల అడుగుల పొడుగు కాలు వలు వస్తాయి. పన్నెండుచోట్ల కానాలు కట్టాలి.

అరవై అడుగుల వెడల్పు రోడ్లు రెండు, నలభై అడుగుల వెడల్పు రోడ్లు నాలుగు. రోడ్లకి సహం మేర, తొమ్మిదంగుళాల మందాన్ని కంకర పొయ్యాలి.

సర్వే చేయించడం

ప్లాను తయారు చెయ్యడం

బ్లూప్రింట్లు తీయించడం

మునిసిపాలిటి ఆఫీసులోను, టవున్ ప్లానింగు ఆఫీసులోను, లే ఔట్ అప్రూవ్ చేయించడం-

తిరగడానికీ కనపడానికీ-

దానికీ దీనికీ బాగా ఖర్చవుతుంది.

అన్నీ కలుపుకొని, దానిమీద నూటికి పది లాభం వేసుకుని, నూటికి రెండు సాదర్లు వేసుకుని ఎస్టిమేటు తయారుచేశాను.

లక్షతొంభయ్యేనిమిది వేల ఆరువందల కొచ్చింది. ఇరవై వేలు మిగుల్తాయి. రామనాథానికీ, మిగతావన్ని సాయం చేసేవాళ్ళకీ ఎంత గరిపెజారుగా పారేసినా పదివేలు ఖరాగా నా వాటాకి మిగుల్తాయి. ఐదువేలు అప్పులు తీర్చుకుని అయిదువేలు పెట్టుబడితో ఓ ఆటోరిక్షాకొని మా తమ్ముణ్ణి తిప్పమంటే, అక్కణ్ణించి వాడికీ రోజుకి నలభై యాభై రూపాయలదాకా కిట్టుబాటవుతుంది రోజుకి.

రోజూ పనితో సాయపడ్డానికి. కూలివాళ్ళు పని ఎగ్గొట్టకుండా చూడ్డానికి. సాయంకాలం అయ్యేసరికి చిల్లరతోసహా కూలి నివాడా చెయ్యడానికీ ఆ లెక్కలూ అవీ చూసుకోడానికి మా తమ్ముడు ఉండనే ఉన్నాడు.ఈ ప్రాజెక్టులో వాడికి కొంచెం ఆర్గనైజేషనూ అదమాయింపూ పట్టుబడితే ముందు ముందు ఎందుకేనా పనికొస్తాడు.

* * *

ఒకటికి నాలుగుసార్లు ఎస్టిమేటుని చెక్ చేసుకుని, రామనాథంచేత కూడా స్క్రూటినీ చేయించి, ధోకా లేదని నిశ్చయించుకుని బాలకృష్ణమూర్తిగారి చేతుల్లో పెట్టేను.

* * *

ఐదు రోజులయింది.

బాలకృష్ణమూర్తిగారు కార్లో వెళుతూ మా యింటి కెదురుగా ఆగినట్టున్నారు. కారు హారన్ వినబడింది.

లుంగీ సర్దుకుంటూ ఇంట్లోంచి బైటికెళ్ళాను.

“నమస్తేండీ” అని ఆయనే పలకరించేరు.

“అయ్యా. నమస్కారమండి” అన్నాను.

“ఆఫీసు లేదాండి, ఇవ్వాళ?”

“వుందండి. పొద్దుట ఔట్‌డోర్ కెళ్ళొచ్చేను. మధ్యాహ్నం ఆఫీసు కెళ్తాను.”

"ఆఁ. ఏం లేదు. ఇవాళ మా లాయర్స్ సొసైటీ మీటింగున్నాది. అందులో మీ ఎస్టిమేటుని డిస్కషన్‌కి పెడుతున్నాను" అన్నాడు.

"ఏదీ మొన్న మీ కిచ్చిందా?—సరిసరి" అన్నాను.

నా అంతట నేనేం ఉత్సాహం చూపించకుండా ఉందామని ప్రయత్నంతో అలా మాట్లాడాను.

"దాని విషయం—" అని కళ్ళు చికిలించి ఆగాడాయన.

"చెప్పండి."

"ఆఁ. ఏంలేదు—మా మెంబర్సుకి ఆ ఎస్టిమేటు విషయంలో ఏవైనా సందేహాలొస్తాయేమోనని—మీరు ఖాళీగావుంటే మా మీటింగుకి రాకూడదు, పోనీ?"

"బావుండదండి. ఏదో గవర్నమెంటు జాబ్ చేస్తున్నాను కదా. ఇదేదో గుట్టుగా జరిగితే బావుంటుందనుకుంటున్నానండి!"

"ఐసీ-" అని, తలపైకెత్తి, కొంచెం ఆలోచించినట్టు నటించి "ఆ ఎస్టిమేటు గురించి మీరు మరో మాట ఏమీ చెప్పలేరా?" అనడిగాడు.

"చెప్పేదేముందండి" కనీసపక్షం అయ్యే ఖర్చు మీకు రాసిచ్చేను.అంతకంటే తక్కువకి ఎవరూ చెయ్యలేరు. ఒకవేళ చేస్తే రోడ్లమీద కంకరకి బదులు ఇసకా,కాలవలు రెండడుగుల్లోతు తియ్యడానికి బదులు ఏ అడుగున్నరో తీసి వొదిలేడం-అలా జరుగుతుందండి."

"సో! అంతకంటె ఎవరేసినా తగ్గదంటారా?" అన్నాడాయన.

"తగ్గడం అసాధ్యమండి. నా వరకు చెప్పాలంటే, లక్షా తొంభయ్యేనిమిది వేల ఆరువందలని వేసేనుకదా. రౌండ్ ఫిగర్ కోసం రెండు లక్షలు చూపించేను. కావాలంటే ఆ పధ్నాలుగు వందలు తగ్గచ్చు. అంతకంటే తక్కువ ఎవడన్నా వేసేడంటే పని నాసిరకం అయిపోడమే తప్ప ఉపయోగం ఏమీలేదండి" అన్నాను.

"సర్లెండి. నేను చూసుకుంటాను. ఓ.కె!"

* * *

ఆ తరవాత బాలకృష్ణమూర్తిగారి దగ్గర్నుంచి కబురొస్తుందని చూస్తున్నాను కబుర్రాలేదు సరిగదా ఆయన కారు మా ఇంటి పక్కనించి వెళ్ళిపోతున్నప్పుడు కూడా తీక్షణంగా రోడ్డు చూసుకుంటూ వెళ్ళిపోతున్నాడే కాని మా ఇంటివేపు తల తిప్పిచూడ్డం కూడా లేదు.

ఆయన కారాపిల సంగతి ఏమయిందని అడుగుదామని అనిపిస్తుంది. నాకే కాకండా వాళ్ళకూడా వుపయోగమయిన పని కదా. ఆయనే చెబుతాడులే అని అనిపిస్తుంది.

రోజూ రామనాధం నేనూ ఆఫీసులో కలుస్తూనే వుంటాం. ఏదో పనికీ పనికీ మధ్య ఈ సంగతి వస్తుంది—శెలవు పెట్టాలి—రెండు నెలలు పెడితేతప్ప పని పూర్తికాదు. నేనొక నెల పెడతాను నువ్వొక నెలపెట్టు సరిపోతుంది- అని రామనాథం అన్నాడు. సరే అంటే సరే అనుకున్నాం. ఏమీతోచక గోళ్ళు కొరుక్కునేటయిమప్పుడు శెలవు కాయితం ఎలా రాస్తే బావుంటుందీ అని ముసాయిదా రాసుకోడం కూడా జరిగింది.

మేం యిచ్చిన టెండరుమీద అంగీకారం తెలుపుతూ పని ప్రారంభించమని కాయితమూ రాలేదు. కబురూ రాలేదు. నా టెండర్లో వేసిన సొమ్ము కన్నా తక్కువకి ఎవరయినా చేస్తామని వేరే టెండర్ ఇచ్చేరేమో అని అనుమానం పీకడం మొదలుపెట్టింది. మళ్ళా మా ఎస్టిమేటూ ఆ రఫ్ కాయితాలూ అన్నీ తిరగేసి చూశాను అంతా అత్తెసరు గానే వేశాను. గవర్నమెంటు జీతం నాలుగు వందల యాభై రూపాయలు వొస్తుండబట్టి పెద్ద లాభం వేసుకోకుండా యిచ్చేను. మరొకరయితే నూటికి మూడురూపాయలు వడ్డీ కింద కూడా వెయ్యాలి గనక నా టెండర్ కన్నా తక్కువ చేసి ఎవరూ ఇవ్వలేదనే తేల్చుకున్నాను.

అలా పదిహేనురోజులు దాటుంటుంది.

* * *

సైకిల్ తొక్కుకుంటూ ఎల్లమ్మతోట జంక్షన్ దగ్గర ఒక పెద్ద లోడ్ లారీని తప్పించుకోబోయి ఒక స్కూటర్‌కి తగిలించాను సైకిల్ని.

“ఏమయ్యా ఇంటిదగ్గర చెప్పే వొచ్చావా?” అని స్కూటరాయన దయగా పలకరించాడు.

“రోజూ అదే అలవాటు మరి; ఈరోడ్ల ధర్మమా అని.” అంటూ అతన్ని తేరిపార చూసి “నువ్వు రాజారావు కదు?” అన్నాను. “హారి-నువ్వట్రా” అని, స్కూటర్ దిగి పక్కకి తీసి. “రా, రా! ఎక్కడుంటున్నావు?” అని పలకరించేడు రాజారావు.

“నువ్వు దయతలిచేవు కనక ఇంకా ఇక్కడే వున్నాను! లేకుంటే ఈపాటికి” అని పైకి ఓ వేలు చూపించేను.

రాజారావు స్కూటర్‌కి స్టాండేసి నా భుజమ్మీద చెయ్యేసి "మంచివాడివే పొద్దుట యవడి మొహం చూసేనో కాని పెద్ద యాక్సిడెంటు క్షణంలో తప్పింది' అన్నాడు.

"నువ్వు కనపడి ఐదేళ్ళయింది, లోగడ స్టేట్ గవర్నమెంట్లో సర్వేయర్‌గా వుండేవాడివి" అన్నాను.

"అవును. ఆ తరవాత టవున్ ప్లానింగ్‌కి వెళ్ళిపోయేను, అక్కడుండగా నలుగురు పెద్ద మనుష్యుల్తోనూ పరిచయం ఏర్పడి—" అని ఆగేడు రాజారావు.

"కొంచెం సంపాదించుకుని—" అని స్కూటర్‌వేపూ, వాడు నాలుగు వేళ్ళకీ తగిలించుకున్న ఉంగరాలవేపూ చూపిస్తూ "ఉద్యోగం మానేసుంటావు" అన్నాను.

"ఎగ్‌జాక్ట్‌లీ— టవున్ ప్లానింగ్‌లో ఉద్యోగం మానేసినా, వాళ్ళపనే చేస్తున్నాను- కంట్రాక్ట్లు" అన్నాడు.

"ఇల్లెక్కడ?"

"ఇల్లిదుగో ఇల్లీసందులోనే, రా, పోదాం. నీకు పార్టీ ఇస్తాను!" అని స్కూటర్‌స్టాండు ఊడదీసేడు.

"పార్టీ యెందుకు!" అన్నాను, మరేదో గొప్ప విషయం చెప్తాడని,

"ఎందుకేమిటి! ఉన్నపళంగా జెయిలు కెళ్ళవలసిన వాణ్ని కాపాడేవు; పద, పద!"

అలా వెళ్ళి వాడింట్లో కాఫీతాగి ఆ కబురూ ఈ కబురూ చెప్పుకున్నాం. వాడు టౌన్ ప్లానింగ్ కంట్రాక్టులు చేస్తున్నానన్న దగ్గర్నించీ నా ప్రాజెక్ట్ సంగతి వారితో చెబ్దామని కోరిక మొదలయింది. అంచేత వాడితో వాడింటి కెళ్ళాను.

"ప్రస్తుతం ఎక్కడ, నీ ఏరియా ఆఫ్ అపరేషన్?" అన్నాను.

"ప్రస్తుతమా?—ఏదో వో అణా కానీ బేరం వోటి తగిలిందిలే, అది చేస్తున్నాను." అని, నేనడక్కుండానే బాలకృష్ణమూర్తిగారి పేరు. ఆ ప్రాజెక్ట్. అన్నీ చెప్పాడు. 'వా:మైంది మొదలెట్టి!' అన్నాడు.

"ఎంత కిడుతుంది, ఇందులో?" అన్నాను.

"కిడుతున్నది లక్షరూపాయల్దాకా వుంటుంది. కాని ముడుతున్నది మాత్రం యిరవై వేలకి మించి ఉండదు" అన్నాడు చిన్న నవ్వూ ఓ సిగరెట్టూ వెలిగిస్తూ.

"అదేంటలాగ? ఇన్‌కమ్‌టాక్స్ లెక్కల్లాగ బోధపడకుండా చెప్పేవు." అన్నాను.

"అదంతేలే. నేను పెట్టింది హయ్యెస్టు టెండరు. ఆ లాయర్స్ సొసైటీ అక్కడ గజం అయిదు రూపాయలచొప్పున జాగా కొన్నారు. రోడ్లూ కాలవలూ యేర్పాటు చేసి ఇల్లు కట్టడానికి జాగా వొప్పచెప్తే, గజానికి పదిహేన్నుంచి పదిహేడు రూపాయల దాకా వుంది టౌన్ ప్లానింగ్ వాళ్ళరేటు. ఆ రేటుకి నేను మూడురూపాయలు తక్కువ చేసి చెప్పేసరికి సొసైటీ చాలా సంతోషంతో వొప్పు కుంది. కాని ఈ బాలకృష్ణమూర్తి గారున్నాడే, దేవాంతకుడు. నా టెండర్ని అలా నీట్లో నానబెట్టి: దాన్ని వాడి చేతా వీడిచేత తిరగా మరగా లెక్కలు కట్టించి, నేను రెండులక్షల యనభై ఆరువేలన్న దాన్ని ఎవడో లక్షా తొంభ య్యేనిమది వేలకి చేస్తానన్నాడంటూ వొక యెస్టిమేటు పట్టుగొచ్చేడు!—అది చూసి నేను నిర్ఘాంతపోయేను. కించ చేడు నాకు అనుకున్నదానికంటే యాభై వేలు తక్కువ వొచ్చింది. ఈ వర్కొస్తే ఆ నష్టాన్ని పూడ్చుకొని మరో యాభై వేలు చేసుకోవచ్చుకదా అని నే చూస్తుంటే పులిమీద పుట్రలా వీడొకడు తగి లేడు. నా పీకల మీదికి!"

నాకు చమట్లుపోశాయి. ఆ టెండర్ నేనే యిచ్చేనని ముందుగా తెలిస్తే ఇందాక స్కూటర్ మీదుండగా నన్ను దయ తల్చుండే వాడా, రాజారావు; అను కొని కేజీ గాలి లోపలికి పీల్చేశాను.

"మరి వాడెవడో అంత తక్కువకి చేస్తానన్న పని, లక్షరూపాయల తేడాతో నీకెలా వొప్ప చెప్పాడీ బాలకృష్ణమూర్తిగారు!" అన్నాను.

"సరిపోయింది!" అని తల వేళాకోళంగా ఆడించేడు రాజారావు. "లోకం మీద నేనే పెర్రి వెధవని అనుకున్నాను" అన్నాడు. నాకన్నా పెర్రి వెధవ్వి నువ్వొకడి వున్నావని స్ఫురణకి తెస్తూ.

"చూడు భాయ్ రైల్వే టయిమ్ టేబిళ్ళ వుపయోగం ఏమిటి?" అని అడిగేడు: కొంచెం ఆగి.

"అదేమిటా ప్రశ్న?"

“రెయిళ్ళు వొచ్చేక, ఎంత లేటుగా వొచ్చేయో తెలుసుకోడానికి. అలాగే, హాయ్యెస్టు టెండర్ నా దగ్గర తీసుకుని, లోయెస్టు టెండరు ఇంకోడి దగ్గిర తీసుకుని ఈ వర్కులో ఎంత మిగల్చొచ్చో లెక్క చూసుకున్నాడయ్యా. బాలకృష్ణమూర్తిగారు. లక్ష మిగుల్తుందీ అని తేలిం తరవాత, ఆ వర్కు నీకివ్వడానికి వీల్లేదంటూ మొదలుపెట్టి. చివరికి, ఈ వర్కు నీకే యిస్తాను. మరి నాకేమిస్తావు అంటూ బేరంపెట్టేడు.”

“అదా!” అని తెల్లమొహం వేసేను.

“ఈ వర్కు సొసైటీ అంగీకారంతో ఆయన నాకు వొప్పచెప్పేటట్టు. నా హాయ్యెస్టు టెండరు ప్రకారం సొసైటీచేత నాకు డబ్బు యిప్పించేటట్టు. ఈ లక్షలో డెబ్బయివేల మేరకి ఈ ప్లాట్లలో వొక దాంట్లో బాలకృష్ణమూర్తిగారికి ఒక యిల్లు నేను కట్టించి ఇచ్చేటట్టూ మా యిద్దరి మధ్యా ఏర్పాటు” అని రాజారావు కథ ముగించాడు,

***